క్లుప్తంగా

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు పదో రోజుకు చేరాయి. స్వామివారికి బుధవారం సుప్రభాత సేవ, ఆండాళ్ళ గోష్ఠి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం హరికృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి పంచ హారతులను ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

రైతుబజారు ఇన్‌చార్జి ఈవోగా సురేష్‌కుమార్



పెడన: రైతుబజారు ఇంచార్జి ఎస్టేట్ అధికారి(ఈవో)గా ఎన్‌వీఎన్ సురేష్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన పెడన రైతుబజారులోనే సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు మచిలీపట్నం రైతుబజార్ ఈవో అమీద్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా, సూపర్‌వైజర్ల ఉద్యోగోన్నతుల్లో భాగంగా సురేష్‌కుమార్‌కు ఈవోగా ఉద్యోగన్నతి లభించింది. ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

పశుగణన 43శాతం పూర్తి



మేళ్లమర్తిలంక(మోపిదేవి): మండలంలో పశుగణన కార్యక్రమం 43శాతం పూర్తయినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్ బుధవారం తెలిపారు. మండలంలోని 11,764 గృహాలను సందర్శించి ఆయా ఇళ్లలో ఉన్న గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, బాతులు, కుక్కలు, పందులు తదితర వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం 11మంది ఇన్విజిలేటర్లు ఆయా గ్రామాల వారీగా ఇళ్లకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారని, ఇప్పటివరకు 5500 ఇళ్ల సందర్శన పూర్తయిందన్నారు. ఈ పశుగణన కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వతేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

వాసవి అమ్మవారికి పూజలు



కోడూరు: వాసవీ అమ్మవారి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. కోడూరులోని దానాశక్తి ఆర్య వైశ్య ప్రార్థనా మందిరంలో ఉన్న అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి గాజులు, వివిధ రకాల పుష్పాలతో అలంకారం చేశారు. పసుపు, కుంకుమతో తీర్చిదిద్దిన అమ్మవారికి చిత్రపటం విశేషంగా తీర్చిదిద్దారు. అనంతరం వాసవీ అమ్మవారి ఉత్సవమూర్తిని ఆర్యవైశ్యుల ఇళ్లకు తీసుకువెళ్లి పూజలు చేశారు. యువత డప్పువాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. గురువారం అమ్మవారికి పాలపొంగళ్లను సమర్పించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వృద్ధుడి నేత్రాలు దానం



నాగాయలంక: గ్రామంలోని రెండోవార్డుకు చెందిన యలవర్తి సత్యనారాయణ(85) బుధవారం అనారోగ్యంతో మృతిచెందగా, కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ద్వారా గుంటూరు జిల్లా పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు దానం చేశారు. సత్యనారాయణ మృతి విషయాన్ని ఆయన కోడలు లక్ష్మి, కుమార్తె శివపార్వతి, కుటుంబసభ్యులు కలిసి సేవాసంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకటనారాయణలకు తెలియజేయడంతో వారి సమాచారం మేరకు శంకర కంటి వైద్యశాలకు చెందిన డాక్టర్ వందన బృందం వచ్చి మృతుడి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికి సేకరించిన నేత్రాల సంఖ్య 221కి చేరిందని రఘుశేఖర్ తెలిపారు.

వాజ్‌పేయికు ఘననివాళి



కోడూరు: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానిగా వాజ్‌పేయి దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని బీజేపీ నాయకులు కొనియాడారు. వాజ్‌పేయికి నివాళులర్పించిన వారిలో బీజేపీ జిల్లా కార్యదర్శి దొండపాటి శ్రీనివాసరావు, ఆర్టీ యాక్ట్ జిల్లా కన్వీనర్ కొండవీటి రామకృష్ణ, నాయకులు వంగవరపు జోషి, చిర్రావూరి అనిల్ తదితరులు ఉన్నారు.



బంటుమిల్లి సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



ఘంటసాల గిల్గాలు చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విశ్వాసులు



పదతడికలో కేక్ కట్ చేస్తున్న కృత్తివెన్ను జెడ్పీటీసీ మైల రత్నకుమారి

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

మచిలీపట్నంటౌన్: క్రైస్తవుల ఆరాధ్యదైవం ఏసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రిస్మస్ పండుగను నగరంలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నూతన వస్త్రాలను ధరించి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కేక్‌లు కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నగరంలోని ప్రముఖ చర్చిలైన తెలుగు, ఆర్‌సీఎం, ఎల్‌ఈఎఫ్, ఫెయిత్ టెంపుల్, నోబుల్, బేరాకా, సీఎస్‌ఐ చర్చిలు, హోసన్నా, బేతని ప్రార్థన మందిరాలకు క్రైస్తవులు వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలుచేసి, ఆశీర్వచనాలు అందించారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి గుప్తా సెంటర్ వద్ద ఉన్న ఏసుక్రీస్తు విగ్రహం వద్ద క్రైస్తవ సోదరులు మేడికొండూరు మధుకర్, గంగ్రపు సీనయ్య, చుక్క జయంత్, అజయ్ తదితరులు ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి కొల్లు రవీంద్రకు ఆశీర్వాదం అందించారు. ఈసందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ఏసుక్రీస్తు శాంతి, దయ, ప్రేమ, సహనం, కరుణతో కరుణామయుడుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవాళికి ఆరాధ్యుడు అయ్యారని పేర్కొన్నారు. హైనీ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి రవీంద్ర పాల్గొని కేక్ కట్ చేశారు పాస్టర్ ఎం.విజయరాజు వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఇమ్మానుయేలు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు వంపుగడవల చౌదరి, జనసేన నగర అధ్యక్షులు గడ్డంరాజు, టీడీపీ నాయకులు చిట్టూరి యువరాజు, బాషా, కార్పొరేటర్లు దేవరపల్లి అనిత, ఛాయాదేవి, టీడీపీ ఎస్సీ విభాగం నాయకులు గుమ్మడి విద్యాసాగర్, వసంతకుమారి, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

సత్యసాయి మందిరంలో..

నగరంలోని భగవాన్ శ్రీ సత్యసాయి మందిరంలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మందిరంలో ఓంకారం సుప్రభాతం నగర సంకీర్తన, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించారు. సమితి కన్వీనర్ పోతుకుచి ఆంజనేయ కుమార్ మాట్లాడుతూ మతాలన్నీ మంచినే బోధిస్తాయన్నారు. సత్యసాయి బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తుర్లపాటి గిరీష్‌బాబు, విద్యావిభాగ సమన్వయకర్తలు పి వరప్రసాద్, కళ్యాణి, బాలవికాస్ గురువులు పి.విశాలి, లక్ష్మీబాయి, ఎస్.విశాలి, హనుమకొండ వెంకటేశ్వరరావు, హనుమంతరావు, కాళికాదేవి, అనురాధ, శైలజ పాల్గొన్నారు.

బంటుమిల్లి మండలంలో..

బంటుమిల్లి: క్రిస్మస్ సందర్భంగా విశ్వాసులు గ్రామాల్లోని చర్చిలలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బంటుమిల్లి ఆర్సీఎం చర్చి ఫాదర్ కొండ మహేష్, సీఎస్‌ఐ డీనరీ చైర్మన్ మట్టా జాషువా ఆధ్వర్యంలో బంటుమిల్లిలోని చర్చిలతో ఆయా గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సీఎస్‌ఐ చర్చిలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హోసన్నా, సాలోన్, విస్స, బెరకా తదితర ప్రార్థన మందిరాల్లోనూ పాస్టర్లు, సంఘస్తులు ప్రార్థనలు చేశారు.



హైని చర్చిలో కేక్ కట్ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, క్రైస్తవులు



పెదకళ్లేపల్లిలో నూతనవస్త్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అరజా సంధ్యారాణి

గూడూరు మండలంలో..

గూడూరు: క్రిస్మస్ పర్వదినాన్ని గూడూరు మండలంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం రాత్రి నుంచే ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గూడూరులోని షాలెం చర్చిలో పాస్టర్ ఏసు రత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో సంఘస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఏసు రాకను కాంక్షిస్తూ గ్రామంలో క్యారల్స్ నిర్వహించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని మండలంలోని ప్రార్థనా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. సంఘ కాపరులు క్రిస్మస్ సందేశాన్ని అందించారు.

కృత్తివెన్ను మండలంలో..

కృత్తివెన్ను: మండలవ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని ప్రార్థనా మందిరాలలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సీతనపల్లి సీఎస్‌ఐ చర్చిలో సంఘ పెద్దలంతా కలిసి స్థానిక వైద్యులు తెలగంశెట్టి వెంకటరమణను ఘనంగా సత్కరించారు. మంగళవారం రాత్రి క్యాండిల్ సర్వీస్, ర్యాలీలతో విశ్వాసులు సందడి చేశారు.

ఘంటసాల మండలంలో ..

ఘంటసాల: ఘంటసాల మండలంలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ విశ్వాసులు ఘనంగా జరుపుకున్నారు. గిల్గాలు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దైవజనురాలు కావూరి దేవమణి ధనరాజు సమక్షంలో ఘంటసాల, తాడేపల్లి చర్చిల్లో జరిగిన క్రిస్మస్ ఆరాధనలో పాస్టర్లు కె.దానియేలురాజు, నవీన్‌బాబు, ప్రేమ్‌చంద్, సతీష్‌పాల్, డాని సందేశమిచ్చారు. ఘంటసాల, కొడాలి బాప్టిస్టు చర్చిల్లో పాస్టర్లు ఎండీవీ ప్రసాద్, ఎం.ప్రియానందం, హైనీ చర్చిల్లో పాస్టర్ కె.దానియేలు, జె.జీవన్, ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరాల్లో ఎ.ఏసు, సీహెచ్.దానియేలు, ఐఆర్‌ఈఎఫ్ చర్చిలో కె.యేసుపాదాలు, యండకుదురు, కొడాలి, తెలుగురావుపాలెం, శ్రీకాకుళం, పాపవినాశనం, దాలిపర్రు, దేవరకోట చర్చిల్లో పాస్టర్లు శీరం సుందర్‌సింగ్, గుడిసేవ ప్రదీప్, కె.ప్రకాష్, ఎస్.షాలేమ్‌రాజు, శేఖర్, యేసుముత్యాలు, గోవాడ శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఘంటసాల పెద్దగూడెం గిల్గాలు చర్చిలో సర్పంచ్ జి.వెంకటేశ్వరమ్మ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

కోడూరులో..

కోడూరు: క్రిస్మస్ పర్వదిన వేడుకలను కోడూరుతో పాటు ఆయా గ్రామాల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కృష్ణాపురం ఆర్సీఎం చర్చిలో విచారణ గురువులు జోజి, ప్రశాంత్ విశ్వాసులకు ఏసు జననాన్ని వివరిస్తూ సందేశమిచ్చారు. మానవుల పాపపరిహారం కోసం క్రీస్తు ఈ లోకాన్ని జన్మించారని చెప్పారు. అనంతరం క్రిస్మస్ కేక్‌కట్ చేసి విశ్వాసులకు పంపిణీ చేశారు. స్వతంత్రపురం, నాయుడుపేట, లింగారెడ్డిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు క్రిస్మస్ పర్వదిన విశిష్టతను వివరించారు. చర్చి ప్రాంగణాల్లో బాలఏసు జననాన్ని వివరిస్తూ ఏర్పాటు చేసిన పశువులపాకలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఆయా గ్రామాల్లో..

అవనిగడ్డ: దివిసీమలోని పలు ప్రాంతాల్లో క్రిస్మస్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పంచాయితీ పరిధిలోని కోటగిరిలంక ఆర్సీఎం చర్చి, మోదుమూడి ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ సురేష్‌మెర్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరణీయమని పేర్కొన్నారు. సీబీసీఎన్‌సీ, పెంతెకొస్తు, ఎల్‌ఈఎఫ్‌తోపాటు పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

చల్లపల్లిలో:

లక్ష్మీపురం శివారు సాలిపేట ఆర్‌సీఎం చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఫాదర్ రవికుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు సందేశాన్ని అందించారు.

నాగాయలంక మండలంలో..

నాగాయలంక: మండల ప్రజలు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నాగాయలంకలో షెకీనా మినిస్ట్రీస్ చర్చిలో నిర్వాహకురాలు పూషడపు ప్రభుకుమారి నేతృత్వంలో క్యాండిల్ ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కేక్ కట్‌చేశారు. ప్రభుకుమారి మాట్లాడుతూ శాంతిదూతగా ఏసుప్రభువు అనుసరించిన మార్గం, బోధనలే ప్రస్తుత సమాజానికి ఆచరణీయమని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రధాన ఆర్‌సీఎం చర్చిని మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన విశ్వాసులు సందర్శించి ప్రార్థనలు చేశారు. ఎదురుమొండిలో ఆల్మైటీ గాడ్ చర్చ్ మినిస్ట్రీస్ (ఏజీసీఎం)అధినేత చిట్టా రారాజు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. నాగాయలంకలో మండల పాస్టర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు మండలి కిరణ్‌బాబు, మండలి పూర్ణలేఖ ప్రార్థనలు చేశారు. వక్కపట్లవారి పాలెం శివారు ఎన్‌టీఆర్ కాలనీ, నాగాయలంక రాజేశ్వరీకాలనీ, డేగలపాలెం, పెదపాలెం, ఏటిమొగ, ఏసుపురం, మెరకపాలెం, గణపేశ్వరం, చోడవరం, పర్రచివర తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.



నాగాయలంకలో క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న ప్రభుకుమారి

పెడన మండలంలో..



తోటమూల ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ జోజప్ప, జయరాజు, జోజి

పెడన: క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పెడన తోటమూల ఆర్సీఎం చర్చి ఫాదర్ ఎస్.జోజప్ప, ఫాదర్లు జయరాజు, జోజిబాబు విశ్వాసులతో ప్రార్థనలు చేయించారు. కొంకేపూడి చర్చిలతోపాటు పలు ప్రార్థన మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత ఆయా చర్చిలలో చిన్నారులు నృత్యప్రదర్శనలు చేశారు. ప్రేమాంజలి సిస్టర్స్, వివిధ గ్రామాలకు చెందిన క్రీస్తు విశ్వాసులు, సంఘ కాపారులు పాల్గొన్నారు. పట్టణంలోని ఒకటో వార్డులోని దైవకృపా మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో నిర్వహించిన ప్రార్థనల్లో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. చిల్లిముంత యేజ్రా, పాస్టర్ లేమియేలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.



కోడూరు ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విచారణ గురువులు జోజి, ప్రశాంత్

ప్రార్థనలకు చర్చి పరిధిలోని 12 గ్రామాల విశ్వాసులు హాజరయ్యారు.

మోపిదేవి మండలంలో..

పెదకళ్లేపల్లి(మోపిదేవి): క్రిస్మస్ వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పెదకళ్లేపల్లి జీసస్ రివైవల్ చర్చిలో కేక్ కట్‌చేశారు. ప్రముఖ వ్యాపారస్తులు విశ్శంశెట్టి ముగలేశ్వర గుప్త అందించిన నూతన వస్త్రాలను గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి, పాస్టర్ ఎలైజాపాల్ చేతుల మీదుగా విశ్వాసులకు పంపిణీ చేశారు. పెదప్రోలు ఐపీసీ చర్చిలో పాస్టర్ నిజాంపట్నం ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి క్రీస్తు సందేశం అందచేశారు. అరజా కిరణ్ కాంత్, దైవసేవకులు, విశ్వాసకులు పాల్గొన్నారు.



సీతనపల్లి సీఎస్‌ఐ చర్చిలో స్థానిక వైద్యుడు రమణను సత్కరిస్తున్న సంఘపెద్దలు

రేపు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మాజీఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన చేపట్టనున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్‌ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన సీఎం కూటమి ప్రభుత్వం, అందుకుభిన్నంగా విద్యుత్‌ఛార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ పథకానికి మంగళం పాడిందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ప్రజల పక్షాన ఈనెల 27వ తేదీన చేపట్టే పోరుబాట కార్యక్రమానికి పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, పార్టీ నాయకులు మద్ది చిన్నా, చింతలపూడి బాలు, గార్లపాటి గోపి, సింహాద్రి రామచంద్రరావు, గరికపాటి కృష్ణారావు పాల్గొన్నారు.

పడిపూజోత్సవాలు ప్రారంభం

కోడూరు: స్థానిక అయ్యప్ప స్వామివారి 20వ మహాపడి పూజోత్సవాలు బుధవారం రాత్రి అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకుడు కోమ్మూరి శ్రీనివాసశర్మ గురుస్వామి పర్యవేక్షణలో తొలుత గణపతి పూజ, అఖండ కలశస్థాపనతో పడిపూజోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం మండపారాధన, ధ్వజారోహణ కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని అయ్యప్ప మూలవిరాట్‌కు చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. గురువారం ఉదయం ఉత్సవమూర్తికి నవవిధ అభిషేకాలు, మలికాపురత్తమ్మ అమ్మవారికి సామూహిక కుంకుమార్చనపూజలు , ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ తెలిపారు. ఆయా కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకారంలో అయ్యప్పస్వామి ఉత్సవమూర్తి

జాతీయ రహదారిపై భవనం తొలగింపు

పెనమలూరు: విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారి పక్కనే ఉన్న పాత భవనాన్ని అధికారులు బుధవారం తొలగించారు. గత 10 ఏళ్ల క్రితం పోరంకి పరిధిలో విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారిపై బందరు రోడ్డును 150 అడుగులుగా విస్తరించారు. అయితే కుటుంబ వివాదాల కారణంగా తూముల సెంటర్‌లో ఒక భవనం తొలగించలేదు. దాదాపు పదేళ్లుగా భవనం అలాగే ఉండిపోయింది. అయితే కుటుంబ వివిదం పరిష్కారం కావటంతో భవనం తొలగింపునకు లైన్ క్లియర్ అయింది. నష్టపరిహారం కింద దాదాపు రూ.1.30 కోట్లు భవన యజమానికి ప్రభుత్వం అందజేసింది. దీంతో రోడ్డు విస్తరణ పరిధిలో ఉన్న భవనాన్ని జేసీబీతో నేలమట్టం చేశారు. పోరంకి పరిధిలో ఇంకా ఒక శ్మశాన వాటిక భవనం, మరో పాత భవనం, గుడి, ప్రార్థన మందిరం భవనం రోడ్డు విస్తరణ పరిధిలో ఉన్నాయి. వీటి తొలగింపు ఎప్పుడు జరుగుతుందనేది ప్రశ్నార్థకంగా ఉంది.



పోరంకిలో భవనం కూల్చి వేస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

గరుడ అళ్వార్ దివ్య ప్రతిష్ట మహోత్సవం



అవనిగడ్డ: స్థానిక గీతామందిరంలో బుధవారం గరుడ అళ్వార్ దివ్య ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆగమ పండితులు పరాంకుశం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. తొలుత కొట్టె విజయ్ నాగసుప్రియ దంపతులు అందించిన గరుడ అళ్వార్ దివ్య విగ్రహం, పూర్ణకుంభంనకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. హోమాది క్రతువులు నిర్వహించిన తరువాత సంప్రోక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, పారిశ్రామికవేత్త పోతన ప్రకాష్,హేమ, మత్తి శ్రీనివాసరావు, కమిటీ అధ్యక్షుడు తుంగల అంకారావు, హరిబాబు పాల్గొన్నారు.

సహస్ర కలశాభిషేకం



మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీ బొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం విశేష ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం పడిపూజ కార్యక్రమాన్ని కేరళ తంత్రి పద్మనాభం నంబూద్రి వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.